క్లుప్తంగా

సూర్యగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు కొంగుబంగారంలా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస్‌కు దరఖాస్తు చేసుకోండి

మీర్‌పేట: రాజీవ్ యువ వికాస్ పథకానికి సంబంధించి పట్టణ పరిధిలోని అర్హత గల నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని కమిషనర్ జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన నిరుద్యోగులు దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని, దివ్యాంగులు అయితే ధ్రువపత్రం, విద్యార్హతలు, ఏదైనా శిక్షణ పొందిన ధ్రువపత్రం, డ్రైవింగ్ లైసెన్స్‌ను జతచేయాలని సూచించారు. ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తులు అందించాలని, అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన కోరారు.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న బీజేపీ



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

తుక్కుగూడ: దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం రాజ్యంగం, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని పార్టీ నాయకులు ఆరోపించారు. మంగళవారం బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు పుర పరిధిలోని దేవేందర్‌నగర్ కాలనీలో చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవహేళన చేయడం, అప్రజాస్వామిక పరిపాలన అంశాలను ప్రజలకు వివరించారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్కులు అభివృద్ధి చేయాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని రామిడి మల్లారెడ్డినగర్ కాలనీలో సుమారు 800 వందల చదరపు అడుగులు ఉన్న పబ్లిక్ పార్క్ స్థలాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ మంగళవారం కాలనీవాసులు కమిషనర్ పి.సరస్వతికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్కుల అభివృద్ధి లేకపోవడంతో చిన్నారులు ఆటవిడుపు, పెద్దలు వ్యాయామం, వాకింగ్ చేయడానికి అవకాశం లేకుండా ఇంట్లోనే ఉండి సతమతం అవుతున్నారన్నారు. పిల్లలకు, పెద్దలకు, విశ్రాంత ఉద్యోగులకు, మహిళలకు అందరికీ ఉపయోగపడేలా పార్కులు తీర్చిదిద్దాలని విన్నవించారు. స్పందించిన కమిషనర్ హెచ్‌ఎండీఏ నిధులతో పార్కును అభివృద్ధి చేస్తామని వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామిడి శ్రీనివాస్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి ఉన్నారు.

విశ్వహిందూ పరిషత్ కమిటీ ఎంపిక

ఇబ్రహీంపట్నం: విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అధ్యక్షుడిగా పోగాకు సత్తిరాజ్ ఎంపికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా ముత్యాల శశాంక్‌ను, భజరంగ్‌దళ్ సభ్యులుగా తాళ్ల కారుణ్య, బస్వపురం మురళీ కార్తిక్‌ను నియమిస్తూ ఆ పరిషత్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మంగళవారం ఆదేశపత్రాలు జారీ చేశారు.

నేతల పంతం.. రోడ్డుకు శాపం

రాజకీయ నాయకుల విభేదాలు రోడ్డు మరమ్మతుకు అవరోధంగా మారాయి. అభివృద్ధి విషయంలో అన్ని పార్టీల నేతల మధ్య సఖ్యత లోపించడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఆ రహదారిపై వెళ్లే చోదకులు ఇబ్బంది పడుతున్నారు.

నిధులు మంజూరైనా జరగని మరమ్మతులు

- ఆరునెలలుగా అవస్థలు పడుతున్న నాదర్‌గుల్‌వాసులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



అధ్వానంగా నాదర్‌గుల్ మెయిన్‌రోడ్డు

బడంగ్‌పేట్: ఛిద్రమైన రోడ్డుపై ప్రయాణం చేయలేక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌వాసులు మదన పడుతున్నారు. స్థానిక చౌరస్తాను బాగు చేయాలని కౌన్సిల్ నుంచి పోరాడగా ఇటీవల సీసీ రోడ్డుగా మార్చి ఉపశమనం కల్పించారు. చౌరస్తా నుంచి గ్రీన్‌హోమ్స్ కాలనీ, శ్మశానవాటిక వరకు బాగానే ఉంది. కానీ ఎంవీఎస్ ఇంజనీరింగ్ కాలేజీ గేటు ముందు, పరిసర ప్రాంతాల్లో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వర్షం వస్తే బురదతో తీవ్ర అవస్థలు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

రూ.1.50 కోట్లు మంజూరు

నాదర్‌గుల్ చౌరస్తా నుంచి నుంచి గ్రీన్‌హోమ్స్, బార్ వరకు రోడ్డు మరమ్మతు చేసేందుకు కార్పొరేషన్ నుంచి రూ.1.50 కోట్ల సాధారణ నిధులు కేటాయించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారును కొందరు అడ్డుకోవడంతో స్తంభించిపోయింది. ఆరు నెలలు కావొస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. రాజకీయ పార్టీల పరంగా వైరానికి పోయిన నేతలు మాత్రం వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నారు. బడంగ్‌పేట మీదుగా నాదర్‌గుల్ వయా ఆదిబట్లకు అక్కడి నుంచి ఇబ్రహీంపట్నం, ఔటర్ రింగ్‌రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఛిద్రమైన రోడ్డుతో రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు మొదలు పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

> **చాలా సార్లు విన్నవించాం**
>
> 
>
> కౌన్సిల్ మీటింగ్‌లో ఏకగ్రీవంతోనే ఈ రోడ్డు కోసం రూ.1.50 కోట్లు తీర్మానం చేశాం. ఇప్పటికీ ఆరు నెలల అవుతోంది. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికే రాకపోకలు స్తంభించారు. అధికారులకు చాలా సార్లు విన్నవించాం. కానీ పనులు మాత్రం కావడం లేదు.
>
> – నిమ్మల సునీత, మాజీ కార్పొరేటర్

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి



అధికారులపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం ఆమె మున్సిపాలిటీ, జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి సందర్భంగా ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటి సమస్య రానివ్వకుండా చూసుకోవాలన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా బోడిగుట్ట రిజర్వాయర్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నీటి కనెక్షన్లకు సంబంధించి ప్రజలకు క్యాన్ నంబర్ ఇచ్చినట్లయితే డిమాండ్‌కు తగ్గ నీటి సరఫరా చేసేందుకు వీలుంటుందన్నారు. మున్సిపాలిటీ ప్రజలు కూడా నీటి పొదుపుగా వాడాలని సూచించారు. సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, జలమండలి డిప్యూటీ జీఎం శ్రీనివాస్, మాజీ చైర్మన్ అబ్దుల్లా సాది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంగా జల్‌పల్లి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములుయాదవ్



జెండావిష్కరణలో పాల్గొన్న శ్రీరాములుయాదవ్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ అధికారులు ఒక వర్గ ప్రజల వద్దనే ఆస్తి పన్నులు వసూలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. బీజేవైఎం మున్సిపాలిటీ అధ్యక్షుడు పెబ్బేటి నాగార్జున ఆధ్వర్యంలో శ్రీరామ కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరాన్ని ఆనుకొని ఉన్న జల్‌పల్లి మున్సిపాలిటీ ఇప్పటికీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. గోతులమయమైన రహదారులు, పడకేసిన పారిశుద్ధ్యంతో ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారని వెల్లడించారు. హిందువులు నివాసం ఉండే బస్తీలలోనే అధికారులు ట్యాక్స్‌లు వసూలు చేస్తున్నారని, కానీ అభివృద్ధి పనులు చేయడం లేదన్నారు. రాయల్ కాలనీలో అక్రమంగా నివాసం ఉంటున్న వేలాది మంది రోహింగ్యా ముస్లింలను వెంటనే ఇక్కడి నుంచి పంపించేయాలన్నారు. ఇక్కడి ముస్లింలు కూడా వారిని దూరంగా పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.వివేకానందగౌడ్, నాయకులు గొరిగె మల్లేశ్‌యాదవ్, గణేశ్ చించోలే, శ్రీనివాస్‌యాదవ్, శాంత కుమార్, మనోజ్‌కుమార్, సంతోష్‌కుమార్, బోడ హరికృష్ణ, రాజేందర్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకోవాలి

మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శాంతిశ్రీ

కందుకూరు: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రతి రోజు పోషకాహారాన్ని తీసుకోవాలని మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ సూచించారు. పోషణ పక్వాడ-2025 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని కొత్తూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. గర్భిణులు, పిల్లల బరువు, ఎత్తు చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వాలు పోషకాహార లోపం తలెత్తకుండా చర్యలు చేపట్టిందని, అందుకు అవసరమైన ఆహార పదార్థాలను అంగన్‌వాడీల ద్వారా పంపిణీ చేయడంతో పాటు అవగాహన కల్పించే విధంగా పలు కార్యక్రమాలకు రూపకల్పన చేసిందన్నారు. పిల్లల్లో పోషకాహార లోపం ఏర్పడకుండా చూసుకోవాలన్నారు. ఊబకాయం రాకుండా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఇందిర, అంగన్‌వాడీ కార్యకర్త గోవిందమ్మ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి

మహేశ్వరం: ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ సహాయం అందిస్తానని తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో పాలోజీ పద్మమ్మ మరణించడంతో వారి కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం ఆయన అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మద్ది శ్రీధర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస్‌కు దరఖాస్తులు చేసుకోవాలి

ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: మండలంలో రాజీవ్ యువ వికాస్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ఎంబీసీ, బీసీ ఫెడరేషన్, మైనార్టీ కులాలకు చెందిన యువతకు ఆర్థిక సహాయం అందించడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని ఎంపీడీఓ శైలజ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు మండలంలోని 30 గ్రామ పంచాయతీల నుంచి 373 దరఖాస్తులు అందాయి. ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవడానికి చివరి తేది ఏప్రిల్ 14 వరకు ఉందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులలో ఏమైనా సమస్య ఎదురైతే మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఆకులమైలారం, మీర్‌ఖాన్‌పేట, గుమ్మడవెల్లి తండాల్లో మంగళవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మండల పార్టీ ఇన్‌చార్జి పెంటారెడ్డి మాట్లాడారు. రాజ్యాంగాన్ని మోదీ సర్కార్ అపహాస్యం చేసేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా దేశ ప్రజల్లో చైతన్యం కల్పించారన్నారు. కాంగ్రెస్ పాలనతోనే దేశంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సొడపు వెంకటేశ్‌గౌడ్, సీనియర్ నాయకులు అందుగుల సత్యానారాయణ, ఎండీ అఫ్జల్‌బేగ్, జి.రాజు, సరికొండ జగన్, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, సయ్యద్ అజీజ్, ఎండీ సులేమాన్, దంతోజు నర్సింహాచారి, డైరెక్టర్లు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎ.సురేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు ప్రారంభం

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని పసుమాములలో కొలువైన రామగిరిగుట్ట శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ జాతరలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పుట్టమన్ను తెచ్చి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. శుక్రవారం సాయంత్రం సీతారాముల కల్యాణం ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, శనివారం తెల్లవారుజామున రథోత్సవం ఉంటుందన్నారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటుగా నగరం నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

రామలింగేశ్వరస్వామి హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న డైరెక్టర్లు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో గల రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు టీకుల శశిధర్‌రెడ్డి, డైరెక్టర్ల ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా రూ.34,345లు ఆదాయం రాగా వాటిని దేవస్థానం బ్యాంక్ ఖాతాలో జమ చేయవలసిందిగా దేవస్థానం మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావుకు వారు అప్పగించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఇక్కె మాధవిశ్రీనివాస్, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, పగడాల ఉమేశ్, ఆలయ అర్చకుడు దుర్గాప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ గోపి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కోదండరాముడి జాతర



చక్రతీర్థం కార్యక్రమంలో సీఐ అంజిరెడ్డి, గ్రామస్తులు

అబ్దుల్లాపూర్‌మెట్: శ్రీరామ నవమిని పురస్కరించుకుని మండలంలోని కవాడిపల్లి గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. రంగు, రంగుల విద్యుత్ దీపాలు, తీరొక్క పూలు, పచ్చని తోరణాలతో అలంకరించిన మండపంలో వేలాది మంది భక్తుల సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీ కోదండ రాముడి కల్యాణం ఆదివారం రాత్రి కమనీయంగా జరిగిన విషయం తెలిసిందే. సోమవారం తెల్లవారుజామున రావణదహనం జరగగా ఆ దృశ్యాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మంగళవారం జరిగిన చక్రతీర్థంతో వేడుకలు ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కల్యాణోత్సవాలు విజయవంతంగా సాగాయి. నిరంతరం నిఘా ఏర్పాటు చేసిన అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి, ఎస్ఐలు కరుణాకర్‌రెడ్డి, భద్యానాయక్‌లతో పాటు సిబ్బందిని ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల కార్యవర్గం ఎన్నిక



ఆంజనేయులును సన్మానిస్తున్న హెచ్‌ఎంలు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల పావని రిసార్ట్‌లో 14 జిల్లా పరిషత్ పాఠశాలలకు సంబంధించిన హెచ్‌ఎంలు ఏకమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొని ప్రకటించారు. ఈ సందర్భంగా ఈ ఎన్నికల్లో హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.ఆంజనేయులును అధ్యక్షుడిగా ఎన్నుకొని సన్మానించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధితో పాటు సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల విద్యాధికారి వెంకటయ్య, నూతన మండల విద్యాధికారి మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, అమ్మాపూర్ రేణుక, శ్రీనివాస్‌గౌడ్, రఘునాథ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులు సరికాదు

ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఆమనగల్లు: న్యాయవాదులపై దాడులు సరికావని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండెకార్ యాదీలాల్ అన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వం అడ్వకేట్స్ ప్రొటెక్ట్ యాక్ట్ అమలు చేయాలని ఆయన కోరారు. హైదరాబాద్‌లో న్యాయవాది మహ్మద్ ముజ్తబా అలీపై జరిగిన దాడికి నిరసనగా పట్టణంలో మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ప్లకార్డులు చేతబూని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అండేకార్ యాదీలాల్ మాట్లాడుతూ.. న్యాయవాదిపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడుల పై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అడ్వకేట్లను రక్షించేందుకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు జగన్, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, విజయ్‌కుమార్, శేఖర్, కృష్ణ, మల్లేశ్, గణేశ్, సంతోష్, శిరీష్, మల్లేశ్, దేవేందర్, శ్రీనివాస్, సర్దార్‌నాయక్ పాల్గొన్నారు.

యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పతంజలి యోగాసమితి వ్యవస్థాపకుడు పానుగంటి శశిధర్



యోగా శిక్షణను ప్రారంభిస్తున్న శశిధర్

షాద్‌నగర్: పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని యోగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పానుగంటి శశిధర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సహారా కాలనీలో గల వినాయక మండపంలో ఆయన ఉచిత యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు యోగ సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యోగ సాధన చేయాలని సూచించారు. యోగాతో మానసికోల్లాసం కలగడంతో పాటుగా రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. మహిళల కోసం ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు యోగా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పరిసర కాలనీల మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యోగా గురువు హరిత, రామయ్య, విజయకుమార్, కావ్య, కవిత, సౌజన్య, సుగుణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.